# అదృష్టం

జగన్నాధరావు నన్నూ, విశ్వపతినీ భోజనానికి పిలిచాడు. కూతురు పుట్టిన పండక్కి. ఆ మహాతల్లి, ఆయన అత్తగారు, ఆమెచేతులో ఏముందోగాని, ఆ ఒక్క వాక్కాయి పచ్చడితోనే తిన్నాము....భోజనమంతా. ఇంటికి తీసుకుపోవాలి కొంచె మిమ్మంటే యేమను కుంటుందో అనుకున్నాను. తాంబూలమై, బైలుదేరపోతూ వుంటే వాన వొచ్చింది. తమలపాకు పళ్ళేంముందు మళ్ళీ కూచుని రెండోసారి, ఆకుల్ని ధ్వంసం చెయ్యడం ప్రారంభించాము.

"మీ అత్తగారిని మాకు అప్పిస్తావా? అమ్మితావా? లేకపోతేరోజా మమ్మల్ని భోజనానికి పిలుస్తావా? లేకపోతే దొంగతనం చెయ్యమన్నావా?"

"ఏమిటి?"

"మీ అత్త నెత్తుకుపోతాం."

"వంట తనుకాదు."

"ఏమనుకుంటుంది?

"తను ఏ రుక్మిణో, నువ్వు కృష్ణుడూ, తనూ రంభా, నువ్వు రావణుడూ...అనుకొని..."

"అనుకొని...."

"ఇంక వొదలనంటే...."

"విడో మారేజ్ వాళ్ళుకూడా వొప్పుకోర్రోయ్. నాయనా, తీసికెళ్ళండి. పచ్చడి రుచిచూసే మురిసిపడుతున్నారుగాని, ఒక్కరోజు ఆమె సాధింపులూ, అరుపులూ భరించాలంటే ఏ భూకంపాలు వొచ్చినా భయపడరు."

"ఆ భూకంపాలు కలిగినప్పుడు ఇంట్లోంచి బైటికిపోతేసరి."

"ఆ పచ్చడి కలుపుకొని, వొదలలేని స్థితిలో వున్నప్పుడే ఆరంభిస్తాయోయ్ సాధింపులు! ఇవాళ మీరుండబట్టిగాని-!"

"ఇట్లా బెదిరిస్తే భయపడి ఆమెని దొంగిలించడం మాన్తామనా?"

"అదృష్టవంతులకు యిలాంటి అత్తగార్లు దొరుకుతారు."

"పోనీ అత్తగార్లు అనకపోతే, భార్యలే మంచివాళ్ళు దొరకడం అదృష్టమనకూడదూ?"

"వొక్కవంటతో సంతోషపడతామా, మరి భార్యలైతే."

"అలా చూసుకుంటే ఆ సంతోషం భార్యవల్ల రాదు. అదృష్టమంటే, డబ్బూ, పిల్లా, రొమాన్సు అన్నీ కలిసిరావాలి...మన విశ్వపతికి వచ్చినట్లు."

"అదేమిటోయ్, ఎప్పుడూ వినలేదే."

"చిన్నప్పుళ్ళే."

"చిన్నప్పుడేలే, ఇప్పుడు నీకు రొమాన్సు పడుతుందంటే యెవ్వరు నమ్ముతారు? కానీ."

"నేను కలకత్తాలో యం.యస్.సి. చదువుతున్నప్పుడు జర్మన్ సర్కస్ ఒకటి వచ్చింది. లాడ్జివాళ్ళందరం చివర క్లాసుకు పోయినాము. చివర క్లాసు టిక్కెట్టే రెండు రూపాయ లయ్యేను."

సర్కసంతా సరే, పెద్దపులుల నాడించడానికి ఒకామె వొచ్చింది. వొచ్చిన నిమిషంనించి ఆమె వెళ్ళిందాకా, నేను ఎక్కడ వున్నానో మరిచిపోయినా-ఆ మృగాలు ఏవో, వేటి నాడించిందో తెలీదు. ఆమె చెయ్యి కదిలించటం, నడవడం, కళ్ళతో బెదిరించడం, ఇవే చూస్తున్నాను. రక్తం రంగు మొహమల్ డ్రెస్సు వేసింది నడుముకిమాత్రం ఆకుపచ్చ బెల్టు-దానిమీద ధగధగలాడే బాకు. ఇంతే. కాళ్ళకీ, చేతులకీ ఏమీ తొడగలేదు. ఆ చేతుల నునుపూ, తొడల మెరుపూ కదిలినప్పుడల్లా, అలలలాగు చలించే ఆ కండా! ఆమె వెళ్ళింది-గుర్రాలూ క్లౌవున్లూ ఒచ్చారు. కాని ఆమె కనపడుతోంది నా కళ్ళకు మాత్రం.

దోవపొడుగుతా కుర్రాళ్ళు వాగుతూనే వున్నారు ట్రాంలో.

"సింహంపిల్ల బలే మజాగా వుంది."

"ఆ ఆడదానికి ఏం సాహసంరా?"

"నువ్వేమంటావు, విశ్వపతీ?"

నిద్ర వస్తోందని కళ్ళు మూసుకు పడుకున్నాను. పిచ్చెత్తింది. ఎందుకో ఆ బాధ నిర్ణయించుకోలేను, ఈశ్వర దర్శనమైన వాడికి, ఈ లోకమూ, సుఖాలూ, కష్టాలూ, ప్రజలూ, వూళ్ళూ అన్నీ క్షణభంగురాలూ, తృణప్రాయాలైనట్టే. నాకు చదువూ, హాస్టలూ, స్నేహితులూ, ఇల్లూ ఇంటి దగ్గర బంధువులూ, సంసారమూ అన్నీ మాయగా, ఆశ్చర్యంగా కనబడ్డాయి. ఇంక వేరే ధ్యాసలేదు. పక్కమీదనించి లేవగానే ఆమె సంగతే ఆలోచించేవాణ్ని. కాలేజీలో యేమీ వినను. ఆమెనే ఆలోచిస్తూ కలలుగంటాను. ఎప్పుడు సాయంత్ర మవుతుందా, ఎప్పుడు వెళ్ళిచూద్దామా, అనే ఆత్రుత....దగ్గరగా చూడాలని పెద్దటికెట్టుకొన్నాను. ఇంకా బాగా కనపడాలని యిరవై అయిదు రూపాయలు పెట్టి.....ఒపేరా క్లాసు కొన్నాను. దాంతో మనదగ్గర వున్న సొమ్ము ఆఖరు అయింది. ఎందుకు అట్లా బాధపడ్డానో, ఏమి లాభమనుకున్నానో, నేను యిప్పుడు చెప్పలేను. కాని ఆ వయసులో వున్నప్పుడు మన

బాధయొక్క బలం చేతనే, మనం కోరే వస్తువుని సాధించగలమనిపిస్తుంది. పిల్లలు చంద్రుణ్ణి అందుకో గలుగుతామనుకున్నట్టే, మనము స్త్రీల నందుకోగలగుతామనే విశ్వాసం మనని వదలదు...నాలుగైదుసార్లు తల పగిలిందాకా.

చూసినకొద్దీ భ్రాంతి యెక్కువవుతుంది. రాత్రిళ్ళు జర్వం కాచినట్లే ఒకటే బాధతో దొర్లుతాను. ఆమె ఒక్కసారి చూస్తేనా? ఆ పెద్దపులి పట్టుకుంటే ఆమెని! నేనుదూకి పెద్దపులిని లాగేస్తే? సర్కస్ మానేజరు ఆమెని అక్రమం చెయ్యబోతూంటే నేను వెళ్ళి అడ్డుపడితే? ఇలా సినిమాలో చూసినట్టే, నా జీవితంలో జరిగినట్టే, కథలు అల్లుకున్నాను. ఆ సర్కస్ వెళ్ళిపోతే, నేను వెంటపోవాలి అనికూడా అనిపించింది.

ఒక సాయంత్రం డబ్బులేదు, వెళ్ళాలంటే సర్కస్‌కి. అప్పుచేశాను. మర్నాడు టిఫిన్‌లు రెండు మానాను. నాకు కాలేజీలో వొచ్చిన ప్రైజ్ "టెన్నిసన్" అమ్మాను. ఇంకా యింటినించి డబ్బు వారానికిగాని రాదు.

మూడో రోజున అసలు డబ్బు పుట్టలేదు. డేరా దగ్గిరికి వెళ్ళాను. ఎవరన్నా పిలుస్తారే మోనని ఆశ. ఆట మొదలుపెట్టారు. చుట్టూ తిరుగుతున్నాను. మోటారాగింది. పక్కనే నుంచున్నాను. ఆమె దిగి లోపలికి వెళ్ళింది. వెంట యెవ్వడో వున్నాడు, విలువగల సూటులో-వొంటరిగా వాళ్ళిద్దరూ ఒచ్చారు. ఆ మోటారులో, వాడ్ని చంపాలనిపించింది. పాపం కుర్రదాన్నిచేసి, ఒంటరిగా మోటారులో పెట్టుకొస్తాడా! పాపమూ, పుణ్యమూ లేవూ వీళ్ళకి. వెడుతూ నావంక చూచిందేమోననిపించి, వొణికి కరిగి, దుమ్ముతో యేకమయినాను.

నేను బైట వున్నానే, నేనన్నా దగ్గిర లేకండా పెద్దపులి దగ్గిరికి వెళ్ళిందే-ఏం అపాయం ఒస్తుందో కదా! బైట ఒణుకుతున్నాను భయంలో, ఆతృతతో! వాడు మోటారులో పెట్టుకువచ్చాడేగాని, పెద్దపులినించి రక్షిస్తాడా!

గంటసేపటిలో మళ్ళీ ఒచ్చింది వాడితోనే. ఇద్దరూ మోటారెక్కుతున్నారు. వెన్కాల ఎక్కితే నేను; వాడేమన్నా చేస్తాడేమో దోవలో పాప మా పిల్లని?

"ఎవరది?" అన్నాను పక్కనున్నవాడితో.

"ఒహొ" అన్నాడు....వెళ్ళిపోతున్నాడు.

జేబులో వెనక్కి వెళ్ళేందుకు ట్రాం టిక్కెటికి బేడ వుంది; వాడి చేతులో పెట్టాను.

"జోసఫైన్- దీంట్లో పులుల్ని ఆడిస్తుంది."

"ఇల్లెక్కడ?"

ఎడ్రస్ చెప్పాడు.

"వాడెవడు?"

"ఎవడో డబ్బిచ్చినవాడు."

"నేనిస్తే...."

"రేపు నువ్వు వస్తావు, ఆ మోటారులో."

గుండె చివుక్కుమంది.

దీనికోసమా నేను ఇన్ని రోజులూ యీ బాధంతా పడ్డది! యీ నీచురాలికోసమా? ఒక దెబ్బతో నా మోహమంతా ఒదిలిపోయింది. ట్రాంకి డబ్బులుకూడా లేవు. మూడు మైళ్ళు కాళ్ళీడ్చుకుంటూపోయి పడుకున్నాను. కాని ఆమె నడకా, తళతళమనే జరీఅంచు బుజంమీదనుంచి జీరాడుతో, రొమ్ముమీదికి జారడమూ, ముసుకునించి తప్పించుకొని చంపమీద దొర్లే, ఆ జుట్టూ, ఆ చిన్న జరీచెప్పులో ఆ చిన్నకాలూ-నిద్రరాదు. ఆ మొగవాడివంక చూసిన ఓరచూపు-చిరునవ్వు-

మూడురోజులు దాన్నే తిడుతున్నారు. కాని విష్ణునితిట్టి హిరణ్యాకశిపుడు, ఎంత మరిచిపోగలిగాడో-రెక్కలు కాలాయని పురుగు దీపానికి ఎంత దూరం పోగలదో-నాగతీ అంతే అయింది.

డబ్బేకదా! డబ్బిస్తాను. ఇంటిదగ్గరనించి డబ్బు వచ్చింది. ఖర్చుతగ్గించుకుంటే పదిరూపాయలు మిగుల్చుకోవచ్చు దాంట్లో అయిదు దానికిచ్చినా, ఇంక అయిదుతో ఆరాత్రి కేమన్నా కొనవచ్చు. ఇంకోరాత్రా? చాలదూ? కాని మచ్చికౌతాముగా, మెల్లిగా బెల్లించి, నమ్మించి, వూరికేనే వెళ్ళవచ్చు. పోనీ ఆ రెండో అయిదుకూడా యిచ్చేస్తే.

మొగవాళ్ళ మనస్సు చాలా తమాషాగా వుంటుంది. ఆ జోసపైన్ అసలు సుశీలై, మొగవాడివంకే చూడనిదే ఐతే నాకు లభ్యమవుతుందా? కనక మగవాడంటే సరదా పడేది ఐయుండాలి నా ఉద్దేశప్రకారం. కాని ప్రతి మొగాడివంకా చూసేది ఐయుండకూడదు. ఇంకో మగాడివంక చూసిందా చవకై పోయింది. నానాతిట్లు తిట్టి, అసహ్యపడ్డాను. మొగాడికి ఎట్లా ఉంటుందంటే తానెటువంటివాడైనా తనని మాత్రం వలిచేటంత రొమాన్సు మాత్రమే ఉండాలి స్త్రీకి. తాను కోరిన స్త్రీకి. అప్పుడు ఆ రొమాన్సుని, గుడ్ టేస్టు అంటాడు. ఆమెని పతివ్రత అంటాడు.

"పాపం దానిగుణం మంచిదే. అది నన్ను చూసి మాత్రం మనసు పట్టలేక పోయింది. ఇంకోడైతేనా, ఒక్క తన్ను తన్ని, తన భర్తతో చెప్పేదే!" అనుకుంటాడు.

తననిగాక యింకొకర్ని యిష్టపడ్డదా! కులట! పాపాత్మురాలు! ఇల్లాంటివాళ్ళు వుండబట్టే దేశ మిట్లా పాడవుతోంది, వీళ్ళని నరికి కుక్కలకేసినా పాపమా! అంటాడు. ఆ రొమాన్సు దోషమవుతుంది. ఆ స్త్రీ దౌర్భాగ్యురాలవుతుంది.

ప్రతిసాయంత్రం ఆమె ఇంటిచుట్టు ప్రదక్షణాలు మొదలు-ఎప్పుడన్నా కిటికీలోంచి ఏమన్నా కనపడుతుందేమోనని, ఎవడన్నా లోపలికి వెడతాడా, బైటికి వస్తాడా అని- ఒకరోజు మూడుకార్లు ఆగి ఉన్నాయి ఆ ఇంటిముందు. నిద్రపోయే 'ఛాఫర్ని' లేపాను.

"ఎవరి కారు?"

"ఎందుకు?"

"ఊరికేనే."

"షో,"

అతని సలహా తీసుకొని అలా తిరిగి మళ్ళీ వచ్చాను.

"ఎక్కడికి వచ్చారు యీ కారు ఆయన."

"ఆరే వెడ్తావా, తన్నానా?"

మళ్ళీ అతని సలహా నందుకున్నాను సర్కస్ ఆ వూరినించి వెళ్ళిపోతుందే అని భయం పట్టుకుంది.

ప్రతిరాత్రీ ముందుసీటు పదిరూపాయలు పెట్టి రిజర్వుచేసి తీసుకొని, ఆ ఆరగంట తనివితీర చూసి లేచి వస్తాను. సర్కస్ మధ్య వచ్చి అరగంటలో లేచివచ్చే మానవుణ్ణి వింతగా చూస్తున్నారు. ఆమె తలవంచితే నేనూ వంచాను. నావంక కన్ను పడుతుందేమోనని తేరిపార చూశాను. ఆమె పులి దగ్గిర నుంచుంటే, వొణికి కళ్ళు మూసుకున్నాను. నుంచున్నాను చప్పట్లు కొట్టాను. 'బ్రేవో' అని బిగ్గరగా అరిచాను. అంతవరకే. ఆ మోటారు వచ్చేదాకా బైట నుంచుని ఆమె లోపలికి రాగానే, నా రిజర్వుడు సీటులోకి వచ్చి ఆమె ఫీట్ కాగానే నేనూ బయటకు వెళ్ళి, వెళ్ళే ఆమె మోటారు పక్కన నుంచుంటాను.

ఒకరాత్రి ఒక్కతే వచ్చింది. ఆ ఎర్రటి జాకట్‌పైన మెరిసే కంఠాన్ని జాకిట్ చిరుగుతుందేమో అనిపించే 'బస్టు'ని చూసి తల్లడిల్లాను 'ఫీట్' అయింది. నేను బయటికి వెళ్ళాను. ఇంక ఆమెతో మాటాడక బతకలేనని నిరాశ నాకు మొండి ధైర్యాన్నిస్తోంది.

కిందికి చూస్తో, ఆలోచిస్తో వస్తోంది, మోటారు దగ్గిరికి, ఆ నడక, ఆ వూపు, ఆ గుండ్రని చేతులు ఆ చంపల తెలుపు....

"నేనూ వస్తాను ఈ రాత్రి" అన్నాను ఇంగ్లీషులో, నా కంఠమే అది !

చప్పున కళ్ళెత్తి నా వంక చూసింది, విసుగుతో.

"ఎవరు?" అంది.

"నీ ఎడ్మైరర్"

ఛీ, పో అన్నట్టు విదుల్చుకుని మోటారెక్కి తలుపుమీద చెయ్యిపెట్టింది.

అయిపోయింది నాగతి!

"వెళ్ళ వద్దు నేను చెప్పేది విను. నిన్ను చూడక నేను బతకలేను. నన్నట్లా వొదిలేస్తే, నీ మోటారు చక్రాల కిందపడి నలిగిపోతాను."

నా కంఠంలో ఎంత దీనత్వం పలికిందో, నేనే ఆశ్చర్యపోయినాను, నా బాధంతా వినబడ్డది గావును ఆ మాటలోనే.

మళ్ళీ చూసి చిరునవ్వు నవ్వింది. తలవంచింది. పక్కన కూచున్నాను. కారు కదిలింది మాటరాదు. ఆలోచనలేదు. నాలుగు నిమిషాలు నా అదృష్టంతో దిగ్భ్రమచెంది, కదలలేకపోయాను. చెయ్యిజాచి ఆమె చెయ్యిని తాకాను. చెయ్యి లాక్కొని అవతలగా కూచుంది.

తొరతొరగా ఆలోచిస్తున్నాను. మరి యెందుకు ఎక్కమంది? వూరికే కూచుంటే యామనుకుంటుంది? వాళ్ళ పద్ధతు లేమిటి? ఏం మాట్లాడాలో? ఏం చెయ్యాలో? మొదలెట్టాలో? శుద్ధమూర్ఖుడు, అప్రయోజకుడని, యింటిముందు పొమ్మంటుందేమో? వూరికే కూచుంటే !

చప్పున జరిగి ఆమెచుట్టూ చెయ్యివేశా; ఒక్క తోపు తోసింది. రెండోమూల సీటుకింద దబేలుమని పడ్డాను, మోటారాగుతోంది.

"హోరీ, ఏంలేదు పోనీ" అంది.

నాతో,

"గాడిదలాగా ప్రవర్తించకు" అంది.

పెద్ద పులులతో కుస్తీలు పట్టిన జబ్బలవి.... నా నడుం విరిగింది. మెల్లిగాలేచి పైన కూచున్నాను, సిగ్గులేక, ఇంక మళ్ళీ కదలలేదు.

మోటారాగింది. దిగి, లోపలికి రమ్మంది నన్ను. మెల్లిగా చీకట్లో మెట్లెక్కాను. 'స్విచ్చి' నొక్కి గదిలో సోఫామీద కూచోమని, లోపలికి వెళ్ళింది. మళ్ళా వచ్చి ఎదురుగా కూచుంది. బట్లరు బుడ్డీ గ్లాసులూ ముందు పెట్టాడు. నన్నో గ్లాసులోది తాగమంది. ఎన్నడూ ఎరగను. కాని వొద్దంటే ఆ కిటికీలోంచి కిందికితోస్తే.....ఏమిటో అది, వైనూ బ్రాందీ అని పేర్లు వినడమే. నోట్లోపెట్టాను. బావుంది.....

"ఏమంటావు?"

"నువ్వు కావాలి."

"డబ్బు?"

"ఇస్తాను."

"తీసుకొచ్చావా?"

"లేదు."

"రేపు తీసుకురా."

"సరే."

"గుడ్‌నైట్."

"ఎక్కడ కనబడతావు?"

"అక్కడే"

ఎనెదర్ లైన్ (Another line.....) స్విచ్ నొక్కింది....

డ్రైవరు వొచ్చాడు.

"హారీ, యీయన్ని యింటిదగ్గర దింపిరా."

లేచాను....హారీ దూరంకాగానే

"ఎంతో తెలుసా?" అంది మృదువుగా చిరునవ్వుతో.

"ఎంత ?"

"మూడువందలు."

"మూడువందలు?" హాస్యం అనుకున్నాను.

"ఏం ?"

"ఒక్కరాత్రికి, మూడువందలు? రూపాయలు?"

"హారీ"

"యేమ్"

"నాకు నిద్రవొస్తోంది. యీయన్ని బైటికి వెళ్ళమని తలుపులు వేసెయ్యి."

నేను బైటికి వెళ్ళాను. మోటారుకోసం చూశాను. మోటారు లేదు. హారీలేడు! దేవుడా అని నడిచిపోయాను. మూడువందలు? ఏం చెయ్యను?

ఇంక బుద్ధి కలిగి ఆ ప్రస్తావన మానుకుంటే మంచిది! ఐదురూపాయలనుకున్నాను. కాదూ? బావుంది. మూడు రోజులు ఆ వేపుపోలేదు. కాని పగలు తోచదు. రాత్రులు నిద్రరాదు. ఏమీ చదవలేను. అసలు కనపడకుండా వెళ్ళిపోతుందేమోనని భయం. ఒక వేళ వేళాకోళానికి అన్నదేమో? మళ్ళీ యింకొకసారి మోటారుకేసి వెడితే....ఏమి యివ్వనక్కరలేదని..... నవ్వితే?.... ఊరికే అందిగాని.....ఎవడన్నా మూడువందలిస్తాడా? కాక.....వెర్రిమొహాన్ని నన్ను చూసి ఒక్కసారి డబ్బులాగాలని ఎత్తువేసిందా? నేనిస్తాననే!

మళ్ళీ 'సర్కస్'కి వెళ్ళాను. ఆరాత్రి స్నేహితుడి చేతులో పావలా పెట్టి ఆమెకి జీతం నెలకి నాలుగు వందల యాభై అని తెలుసుకున్నాను.

"మరి ఒక్క రాత్రికి మూడువందలా? మరి ఆ రాత్రి రాలా, అల్లాంటి వాళ్ళెంత యిస్తారు?"

"వాళ్ళా ఇంత అని ఏమిటి. నగలు, బట్టలు....అన్నీ !"

"డబ్బు?"

"మూడు వందలు రాత్రికి.'

మళ్ళీ సర్కస్ చూశాను. ఆమె నాకు దక్కదనుకున్న తరవాత, ఆమె మీద కోపం ఎక్కువౌ తోంది. ఆ పెద్దపులి తినెయ్యరాదూ! గొంతు చించెయ్యరాదూ!.....ఎవరికీ కాకుండా!

హృదయంలో మండే అంత ద్వేషమూ, ప్రతినిమిషమూ, చల్లబడి, నీరై ఆమె పాదాల్ని తడుపుతోంది. పరీక్ష మానుకుని యింటికి వెడదామనిపించింది. వెళ్ళి.....! పరీక్ష ఐనాక మాత్రం వెళ్ళి?-ఏముంది? తిండీ, భార్యా, పిల్లలూ, సంపాదనా! మళ్ళీ ఇట్లాంటి బాధ జీవితంలో రుచిచూస్తానా? మావూళ్ళో యిల్లాంటి చర్యలు సాగించానా చెప్పు తీసుకు కొడతారు. కలకత్తా గనక సరిపోయిందిగాని, డబ్బుకైతేనేంగాని, గంధర్వకన్యయివంటిది. నా మొహాన్ని చూసి నాలుగు గజాల దూరానికి రానిస్తుందా? జన్మానికల్లా ఒక అదృష్టం కలిగింది. ఎంత డబ్బుపోసినా మళ్ళీ చూస్తానా? అనుభవిస్తానా?

పరీక్ష సిస్తుకనీ, నెలరోజుల ఖర్చు కనీ, మావాళ్ళు పంపిన రెండువందలూ, వీడిదగ్గిరా వాడిదగ్గిరా గోకి వందా, మూడువందలు జేబులో పెట్టుకొని....మోటారుపక్కన నుంచున్నాను.

"సరేనా?"

తలవూపాను.

మోటారులో ఆమె చిన్ని నడుంమీద నా చెయ్యేశాను. తలని నా బుజాన ఆనించింది. నిన్నటి పిల్లేనా? ధనదేవతా, నిన్ను తప్ప ఇంకొకర్ని పూజించే మానవులంత మూర్ఖులుంటారా యీ ప్రపంచంలో? ఒక్క మంత్రంతో అంత లావణ్యాన్ని నాచేతికింద ఇమిడ్చావు. అంతగర్వాన్ని నా కాలికింద పరిచావు. కలలోనైనా నా యెరగని ప్రేమని నాకు రుచిచూపావు.

దీపాలు వరసగా ఒక్కొక్కటే ఒక నిమిషం ఆమె మొహాన్ని వెలిగిస్తున్నాయి. చిరునవ్వు, కళ్ళు పెకెత్తి నా మొహంవంక చూపు,ఎన్ని తపస్సులుచేస్తే దొరుకుతుంది మళ్ళీ ఆ అనుభవం? యీనాడు నేను సంపాయించిన అరవై యెకరాల మాగాణి, నిజంగా యిన్నేళ్ళు ప్లీడరీచేసి సంపాయించినదంతా మళ్ళీ ధారపోస్తాననుకో....అట్లాంటి రాత్రికోసం. దగ్గిరిగా యింకా దగ్గరగా జరిగింది, మోటారాగితే ఆ స్వప్నం ఆఖరేమో, పొమ్మంటుందేమో! యీ మోటారు ప్రయాణానికి మాత్రమేనేమో-మూడువందలూనూ- ఇంటిదగ్గర యెవడన్నా కాచుకొని వుంటాడేమో. ఈ డ్రైవరేం తగాదా పెడతాడో- అన్న భయాలే!

దిగి మళ్ళీ ఆ గదిలోకి వెళ్ళాము. మళ్ళీ వైను తాగించింది. తాను తాగి నాకిచ్చింది. నేను తాగంది తాను తాగింది.

ఆ బట్టలు తీసేసి సన్నని గౌను వేసుకొంది. ఆ వొళ్ళంతా పిలుస్తోంది నన్ను. ఒక్కనిమిషంలో బల్లదగ్గిర ఆగి అమాంతంగా నావొళ్ళో దూకి కూచుంది. నా మెడచుట్టూ

చెమట, ఆ పరిమళం- ఎక్కడనించో కొంచెంగా గాలిమీదా, నీళ్ళమీదా తేలుతోవచ్చి, ఎక్కడా- ఇదివరకు ఎక్కడ చూశామా- ఇది అనిపించి బాధపెట్టదూ అలా ఆ జుట్టు ఒక సువాసన. ఆమె నోరు వైను పరిమళము, ఆమె వొళ్ళు- మెడ- ఎంత అందవికారండైనా, ఆ సువాసనలు వొదలలేక కావిలించుకుంటాం-ఆమె వొంటిమీదా చిరు చెమటలే 'లవండరా' అనిపించింది.

"రా" అంది లోపలికి.

డబ్బు సంగతి ఏమీలేదు.

నేనే తీసి

"ఇంద" అన్నాను.

కళ్ళు సగం మూతలుగా నిర్లక్ష్యంగా "వుంచుదూ" తరవాత చూద్దాం అంది. ఎంత రాత్రి ఐందో తెలీదు. కొండల్లో అర్ధచంద్రుడు కుంకేప్పుడు నీళ్ళమీద ఎలాంటి వెన్నెల పడుతుంది, అలాంటి కాంతి వొస్తోంది, ఆ తగ్గించిన ఎలక్ట్రిక్ దీపంలోంచి, అలిసిపోయి పొగరంతా పోయి నా చేతులమధ్య పడుకుని నాకేసి చూస్తోంది.

"ఇంక నిద్రపోనియ్యవు?" అంది నా చంపలు రాస్తో.

"ఎన్ని గంటలు?"

దిండుకింద చెయ్యి పెట్టింది; నాలుగు గంటలు మ్రోగాయి.

"మరి యీసారి మోటారులో వెడతానా?" అన్నాను నవ్వుతో.

ఒక్క తోపుతోసి నన్ను పడవేసి నా రొమ్ముమీద తన ముఖం దాచుకుంది.

"సరే, అలానే నిద్రపో."

ఆమె నిద్రపోతోంది. నాకు నిద్రరాలేదు. మూడువందల రూపాయలు? కాని మళ్ళీ జన్మానికి అట్లాంటి రాత్రి వొస్తుందా?

ఒకటే రాత్రి? ఎలా కళ్ళుమూసి వృధా చెయ్యను.

నిద్రపోతో మెల్లిగా లేచి ముఖం నా ముఖం దగ్గరికి తెచ్చి....

"నువ్వెవరు?" అని పడుకుంది.

ఆ ప్రశ్న కేమోగాని

"నేను ఆంధ్రుణ్ని" అని గర్వంగా జవాబు చెప్పాను. మరి తమకీర్తి నంత వృద్ధిచేసినందుకు నాకేమిస్తారో యేమిటో?

అలవాటు ప్రకారం ఆరింటికే మెళుకువ వొచ్చింది. లేవాలంటే నాచుట్టూ చేతులువేసి పడుకునివుంది. కదిలాను. ఆమె కళ్ళు తెరిచి చిరునవ్వు నవ్వి.

"రా అని దగ్గిరికి లాక్కుని నిద్రపోయింది నేనూ నిద్రపోయినాను. లేచేటప్పటికి పదై వుంటుంది. వేణ్నీళ్ళు, చన్నీళ్ళు అన్నీ సిద్ధంగావున్నాయి స్నానానికి. ఆ యింటి యజమానివలె నామాటను శిరసావహించి అతిభక్తితో మెలిగారు నౌకర్లు.

రొట్టె, టీ, వెన్న, మాంసము అన్నీవున్నాయి బల్లమీద. కష్టం మీద కొంచెం రొట్టెతిని, టీ తాగాను. నేను మాంసం తినకపోవడం అతిచిత్రంగా చూసింది.

"మరి-రాత్రి......రాత్రి... అది పనికివస్తుందా మీ కులంలో?"

"ఏం జవాబు చెప్పను?"

"హిందువుల్లో అంతే? అన్నాను, నా మతాన్ని తలుచుకుని సిగ్గుపడుతో లేచాను.

"వెళతావా?"

"గుడ్‌బై!'- దగ్గిరికివచ్చి ముద్దు పెట్టుకుంది.

"మళ్ళీ?" అంది.

"మళ్ళానా?"

"బావుండలేదా?"

నాకళ్ళు జవాబు చెప్పాయి.

"మరి రాత్రి రాకూడదూ?"

అమ్మా! ఆశ-నేను మాట్లాడలేదు.

ఏమనుకుంటోంది? నేను లక్షాధికారినా? నేటివ్ ప్రిన్సునా?

కాని, బికారిననీ యెట్లా వప్పుకోను? రాత్రింత రాజాధిరాజువలె నటించి, రానని తలవూయించాను.

"ఎందుకు?" అని,

కళ్ళు కిందికి వాల్చింది, వింత నటనకి నాకు కోపం వచ్చింది.

"నేను ఎవరునుకున్నావు? రాక్‌ఫెల్లరా?"

నవ్వింది.

"రా"

నా దగ్గిర మూడువందల రూపాయలుకాదు, ఒక్క-"

"ఏమీ యివ్వవద్దు.రా"

నిజమా! నిజమా!!

వెళ్ళిపోయినాను.

ఈ అదృష్టం నిజమా, నిజమా? కలా? సర్కస్ ఆ వూరినించి వెళ్ళిందాకా ప్రతిరాత్రీ వెళ్ళాను. స్నానం, భోజనం-అంతా అక్కడే. పరీక్షా? అడుగుతున్నావా? పరీక్ష ఏమయింది? రామేశ్వరంలో పూజలు సరిగా జరుగుతున్నాయా? భూమి సూర్యుడు చుట్టూ తిరుగుతోందా? మానేసిందా? ఈ కుంటి ప్రశ్నలన్నీ నాకెందుకు?

◆ ◆ ◆

*ప్రచురణ : (అదృష్టం కథల సంపుటి) ప్రేమ్‌చంద్ పబ్లికేషన్స్, 1964*